

# అపుత్రస్య

అందే మల్లిఖార్జునరావు

ఆకాశం మెఘావృతమ్మై వున్నది. సింహగర్జనల్లా భయంకరమ్మైన ఉరుములు; మెరుపులు. కన్ను పొడుచుకున్నా కనబడని చీకటి .చలిగాలి విదిలింపు. యింట్లో దీపం నిలవడంలేదు. కామయ్య ఇంకా ఇంటికి రాలేదు. చీకటింట్లో కూర్చోడానికి కనకానికి భయంగావుంది. ఒంటరితనం పిచ్చెక్కిస్తూ వుంది.

అల్లంతదూరంలో ఈ యింటికెదురుగానే యి.. గాడి గుడిసె వుంది. వాడిపెళ్లాం సీతాలు కొడుకుని నిద్రపుచ్చడానికి శ్రమపడుతూ వుంది. 'ల్లో..ల్లో. హాయి' జోలపాట అస్పష్టంగా వినబడుతూవుంది గాలి హోరుకి. కుర్రాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు 'యెధవపిలగాడు పీకినొక్కి అవతల పారేత్తాను. అంటూనే విసుగుతో రెండు వాయించింది. వాడ శ్రుతిపెంచాడు. యిప్పుడు సీతాలు గొంతుకూడ ధాటీగానే విన్పిస్తూవుంది.' దిక్కుమాలిన పిల్లలు మమ్మల్ని కాల్చుకు తింటానికి పుట్టారు. రాచ్చసిమూక. ఈల్లమ్మాకడుపుడక. సందకాణ్ణుంచి జో కొడతుంటే మనుగుతాడా, సత్తాడా' కనకం మనసులో పిల్లవాడిమీద వాత్సల్యం కలిగింది. 'ఆయింటికి వెళదామా!' అనుకున్నది. కానీ చీకటికి, చలిగాలికి జడిసి 'అక్కడే కూర్చుండిపోయింది; యేమేమో యోచిస్తూ.

కాలక్షేపం కాక బాధ పడుతూ 'క్షణమొక యుగమాయె!' అన్నట్లు యిలాంటి మధురక్షణాల కోసమే యెదురు చూచిచూచి విసిగి పోతున్న కనకానికి యేదోపెద్ద పాటు పడుతున్నట్లు విసుగుతో పసివాడిమీద విరుచుకు పడుతున్న సీతాలు వరస చిరాకు పుట్టించింది. 'పసిపిల్లవాణ్ణి సముదాయించుకోవడానికి కూడా అంత విసుగైతే యెలా? కాసేపు భుజం మీద వేసుకొని జోకొడితే నిద్రపోడూ?.....భద్రకాళిలా విరుచుక పడుతూ వుంటే వాడింకేం నిద్రపోతాడు?..... అలాఅంటే అదొక తంటా!'...మాకేం తెలుసమ్మా!.....యేనాడైనా కన్నామా, పెంచామా?' అంటూ యెత్తి పొడుస్తారు. నేనేదో రికమండేషన్ తీసుకుపోయి దేవుని సహాయంతో యీ బాధంతా లేకుండా చేసుకున్నట్టే కనబడుతుంది వాళ్ల దృష్టికి... ప్చ.....యెవరి బాధ యెవరికి తెలుస్తుంది? వాళ్ల మాటలంటుంటే నా హృదయంలో గునపం పోట్లు పొడుస్తున్నట్లేవుంటుంది. పెళ్లైతే చాలు, సంవత్సరం తిరిగేసరికి దబ్బపండులాంటి పిల్లాణ్నెత్తుకుంటూ వుంటారు. మరి నా దురదృష్టమేమిటో!

అంతా దరిద్రులకు పిల్ల లెక్కువంటారు. అది కూడా మా విషయంలో చెల్లకుండాపోయింది—కనకం యోచిస్తూనే వుంది తీవ్రంగా.

వాడకట్టులో పిల్లలు లేని యిల్లేలేదు; ఈ యిల్లు తప్ప. తనకు ఒక్క నలుసు కలిగితే యెంత బాగుండేది? కామయ్య బావ యెంత సంబరపడేవాడో!.......ఈ యిల్లెంత కళకళలాడుతూవుండేదో!

కామయ్య విషయం గుర్తుకు రాగానే కనకం ఆలోచనలు నెమ్మదిగా తప్పుకున్నాయి.

గాలితగ్గింది. యింట్లో దీపం లేదని కేకవేస్తాడేమో నని దీపం ముట్టించింది. ఉరుములు,మెరుపులు కూడా క్రమంగా తగ్గిపోయాయి; చుక్క వర్షమైనా పడకుండానే! సీతాలు కొడుకు యేడుపు సద్దుమణిగింది. గోవిందయ్యగారి పిల్లలు పాఠాలు చదువుకుంటున్నారు. కనకం పరధ్యానంగా యేదో యేదో ఆలకిస్తూకూర్చున్నది.

అడుగుల చప్పుడు కనకం యేకాగ్రతను భంగం చేసింది. కామయ్య వచ్చాడు. ఆయనవైపే కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నది. చొక్కా యిడిసి వంకెకు తగిలించి 'నీళ్ళుపెట్టావా?' అన్నాడు కామయ్య.

"ఆ!.....రండి త్వరగా స్నానం చేసేస్తే......" అంటూ లేచి నీళ్లకాగు బయట పెట్టింది కనకం. కామయ్య స్నానం చేస్తున్నాడు. గోవిందయ్యగారి పిల్లల మాటలు వినబడుతున్నాయి.

గోవిందయ్యకు నలుగురు పిల్లలు. యీరోజు బజారునుండి గోవిందయ్య తాను కలిసే వచ్చారు. గోవిందయ్య గుమ్మంలో అడుగు పెట్టటంతోనే 'నాన్నగారొచ్చారు, నాన్నగారొచ్చారు.' అంటూ పిల్లలు నలుగురూ చుట్టుముట్టారు.

"నలుగురూ సమానంగా తీసుకోవాలి.....ఆ" తాను తెచ్చిన మిఠాయి పొట్లాలు రెండూ పిల్లలకు యిచ్చాడు. వాటాలు తెగక వాళ్లలో వాళ్లే నెమ్మదిగా తగవులు ప్రారంభించారు. ఒకళ్లిద్దరు రాగాలాపన. క్రమంగా స్థాయి పెరిగింది.

"యెందుకు యేడుస్తారు. సమానంగా తీసుకొని తినేదానికి. వెధవగోలా మీరూను. యిలా అయితే రేపటినుంచి అసలు తీసుకరాను" గోవిందయ్య సుందరింపు.

'వాడేమో కాయితంతో తీసుకుంటాడట.... నాకొద్దు.........నాకొద్దు........నాకే.....' తేనెపలుకులతో చిన్నవాడు పేచీకి కారణాన్ని తన పట్టుదలను కూడా వివరించాడు.

"కాగితమేకదా!.....యిదిగో మువ్వేందుతో వేసుకో నాడు.......యిది బాగావుందిరా...." అనునయించాడు గోవిందయ్య.

"నాకేం, నాకొద్దది." చిన్నాడి మొరాయింపు

"పోనీ నువ్వి కాగితంతో వేసుకోరా. వాడికా కాగితం యిచ్చేయ్."

పెద్దవాడు మాట్లాడలేదు.

"నాన్నాలు......అక్క నేను పంచుకున్నాం." ముద్దుగా అన్నది బేబి.

"భేష్...... అలా వుండాలి..... యివ్వరా పెద్దబ్బాయ్"

"ఉం....." పెద్దబ్బాయి మొరాయింపు.

"యెందుకీ తగవులు. యిలా అయితే రేపటినుండి అసలు తీసుకురాను" గోవిందయ్య హెచ్చరిక.

వళ్ళు తుడుచుకుంటూనే నవ్వుకుంటున్నాడు కామయ్య.

"యేమిటి నవ్వుతున్నారు."

"చిన్నాడు మహా ఘటికుడే........."

"అమ్మా! సిసింద్రీకదూ!...... బే బిమాత్రం?"

"అదీ అంతే...పెద్దాడు, పెద్దపిల్ల కాస్త మెతకే!'

"పెద్దపిల్లమెతకేం కాదులెండి....పెద్ద కుర్రాడే కాస్త.........."

యిద్దరి హృదయాలు సన్నగ నవ్వుకున్నాయి.సంతోషంతో అంతలోనే యేదో మూగవేదనతో క్రమంగా బరువెక్కి పోయాయి.


యధాప్రకారమే యాంత్రికంగా భోజనాలు ముగిశాయి. అలవాటు ప్రకారమే కామయ్య సిగరెట్టు కాల్చుకుంటూ మంచం మీద కూర్చున్నాడు. వంటయింట్లో పని ముగించుకుని వచ్చి అతని కెదురుగా క్రిందనే కూర్చున్నది కనకం.

"పిల్లలతో యమ బాధగా వున్నదంటున్నాడు

మీకు సంతానం లేదా?
ప్రముఖ వైద్యుల, సోదరీమణుల ప్రశంసలొందిన
'స్పెసిఫిక్'
స్త్రీసంజీవి నెం.2
సంతాననిధి
ఆపరేషన భయములేదు.
ఈ స్పెసిఫిక్, అమూల్యము, శక్తివంతము నైన మూలికాయోగము. సకల గర్భాశయ, వంధ్యా దోషములను, అనతి కాలములో నివారణ చేసి శీఘ్రకాలములో మాతృత్వమును కలుగ జేయు మహత్తరయోగము — పత్యములేదు — అనేక ఔషధములు సేవించి, నిరాశ చెందిన సోదరీమణులు, యీ స్పెసిఫిక్ వుపయోగించి, సంతానప్రాప్తినొంది, యోగ్యతా పత్రము లిచ్చియున్నారు.
వెల రు 10-00; పోస్టేజి, ప్యాకింగ్ అదనము
వివరములకు:
శ్రీ నాగార్జున మూలికా కుటీరం
తెనాలి—2 (ఆంధ్ర).



తెల్ల మచ్చలకు
ఉచిత వైద్యము
శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.
Sri Krishna Chandra Vaidya
(A. P.) P. O. Katrisarai (Gaya)


# అపుత్రస్య

గోవిందయ్య'' అన్నాడు కామయ్య యేదో ఆలోచిస్తూ. కనకం మాట్లాడలేదు.

''యిలా నిర్జనంగా, యాంత్రికంగా కాలం గడపడం యెంత బాధో ఆయనకేం తెలుసు.....''

''ఎవరి బాధ వాళ్లదే..... ఉన్న బాధ పొమ్మంటే పోతుందా? లేని బాధ రమ్మంటే వస్తుందా?''

కనకం ముఖంలోనికి చూచి వూరుకున్నాడు కామయ్య.

''మనమేదో సుఖపడి పోతున్నామని వాళ్లనుకుంటున్నారు. వాళ్లకున్న ఆనందం మనకు లేదేమో అని మనమేడుస్తున్నాం.'' అన్నది కనకం కొంచం కటువుగా. కామయ్య మాట్లాడలేదు.

కాలం మౌనం లోనే గడచి పోతూవుంది.

చుట్టుప్రక్కల యిళ్లలోనుండి పిల్లలయేడ్పు, తల్లుల సముదాయింపులు వినబడుతూనే వున్నాయి. బద్ధకంగా మంచంమీద ఒరిగి కళ్లుమూసుకున్నాడు కామయ్య. దీపం కొండి తగ్గించి ప్రక్క పరుచుకున్నది కనకం.

* * *

నారాయణరావుగారబ్బాయిని చూస్తుంటే పచ్చగా నిమ్మపండు ఛాయతో ముద్దులు మూటగట్టినట్లు వుంటాడు. ఆముఖంలో యెప్పుడూ నవ్వుల పువ్వులు నాట్యం చేస్తుంటాయి. యెవ్వరికీ తెలియని యేదో క్రొత్త భాషలో యెన్నో కబుర్లు చెబుతూవుండేవాడు. ఆకుర్రాణ్ణి విడిచి రాబుద్ధయ్యేదికాదు. కనకానికి. గంటల తరబడి ఆపిల్లవాడితో ఆడుకుంటూనే కాలక్షేపం చేస్తూ వుండేది. నారాయణరావుగారి భార్య శాంతమ్మ కనకం ముచ్చటచూచి ''తీసుకెళ్లి పెంచుకోండమ్మా.....వాడిగోల మేం పడలేక చస్తున్నాం.'' అన్నది. ''యేదో పైమాట కన్నావేగాని నువ్వెందు కిస్తావమ్మా!''అన్నది కనకం.

''హాస్యంకాదమ్మా....నిజమే.. తీసుకెళ్లిపో.....'' నవ్వుతూనే అన్నదిశాంత. కనకం ఆమె ముఖంవైపు పరిశీలనగా చూసి పిల్లవాణ్ణి హృదయానికత్తుకుంటూ ''యివ్వడం నిజమయితే మాకే యివ్వండి.'' అన్నది.

''పిల్లలంటే మీకంత సంబర మెందుకండీ.. మాబోటివాళ్లమే బాధలు పడలేక చచ్చిపోతుంటే మీరెలా పెంచగలుగుతారు? మొన్న బాబుకు జ్వరం తగిలితే నూటపాతిక రూపాయలయ్యాయి. యేదో ఉన్నది గనుక సరిపోతుంది. అలాంటి దెబ్బలు మీబోటివాళ్లయితే యెలా యెదుర్కుంటారు చెప్పండి.'' చేతులు తిప్పుతూ యెంతో జాలిని వ్యక్తంచేస్తూ అన్నది శాంత. ఆ మాటల్లో వ్యంగ్యం లేకపోలేదు.

''పారేసుకుంటామా?.. ..యేదో బాధపడి తగిన వైద్యమే చేయిస్తాం.''

''వైద్యమంటే వైద్యమేకాదు. తిండి గుడ్డలు చదువు సంధ్యలు ఒకటేమిటి....పిల్లలంటే ఒక ఖర్చా! అనుకొని ఖర్చులెన్నో వుంటాయి.''

''అయితే మాబోటివాళ్లు పిల్లల్ని పెంచలేరంటారా?'' కనకం మనస్సు కొంచం బాధపడింది.

''ఆ పెంచుతారు.....నా బొంద! పూటకుంటే పూటకు లేక నానాబాధలు పడుతుంటారు, యిక పిల్లలకేం పెడతారు, వాళ్లనేం బాగుచేస్తారు?''

శాంత మాటల్లో వ్యక్తమవుతున్న గర్వాతిశయం చిరాకు పుట్టించింది. మరి మాట్లాడలేదు. వెంటనే అక్కడినుండి వెళ్లిపోవాలనిపించింది. కానీ, బాబును విడిచివెళ్లడానికి మనసు వప్పక బాబుదగ్గరే దిగాలుగా కూలబడి పోయింది.

'మాబోటి వాళ్లకు పిల్లల్ని కనే అర్హతే లేదా? మాకంటే దరిద్రులు కూడా యెంతమంది పిల్లల్ని కనడంలేదు. పెంచడంలేదు. ఆమాటకొస్తే యీ వాడకట్టులో ఉన్న మిగతా కుటుంబాల వాళ్లంతా మాబోటి వాళ్లేగదా! వాళ్లందరికీ పిల్లలున్నారు. బాగానే పెంచుకుంటున్నారు. యెంత గర్వం. లేనివాళ్లంటే యెంత లోకువ ?..... 'తనకు ఉన్నది గనుక తను ఒక్కతే పిల్లల్ని పెంచగలుగుతూ వున్నాను.' అనుకుంటున్నది కాబోలు.' యిలా సాగిపున్నాయి కనకం ఆలోచనలు.

జరిగిన విషయమంతా ఆరాత్రే కామయ్యకు చెప్పింది కనకం. అంతావిని ''ఆవిడన్న మాటల్లో తప్పేముందిలే! .....పిల్లలికి చదువు సంధ్యలు చెప్పించి ప్రయోజకుల్ని చేయగల శక్తి కూడా వుండాలిమరి పూటకుంటే పూటకు లేనివాళ్లం మనమేం చేయగలం ? సరైన తిండి బట్టలు కూడా యివ్వలేం.'' అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ. కనకం ముఖం మాడుచుకు పోయింది.

'ఈయన కూడా పిల్లలు పుట్టకుండా వున్నదే మేలనుకుంటున్నారా? తోటివారంతా పసిపిల్లల్ని అంకాన చేర్చుకొని వాళ్ళ ముద్దు మాటలకు, చిలిపి చేష్టలకు పరవశించిపోతావుంటే తాను చూస్తూ వుండి. మాతృత్వాన్ని పొందాలనే వాంఛ బలీయంగా వేధిస్తూవుంది. హృదయంలో అగ్ని పర్వతాన్నే యిముడ్చుకొని కళ్లు మూసుకొని పడుకున్నది కనకం.

గోవిందయ్యగారి పిల్లలు ఇంకా పాఠాలు చదువుతూనేవున్నారు. ఆయన భార్య లక్ష్మీదేవమ్మ దగ్గర కూర్చొని చదివిస్తూవుంది. పిల్లలతో యెంతో కాలక్షేపం. తనకేమీ లేదు. సోలెడు పొంగిస్తే స్వాతంత్ర్యం వచ్చినట్టే! అంతకంతకూ కళ్లు బండ బారి పోతున్నట్లుంది. సోమరి తనం కూడా కాస్త పెరిగింది. అసంతృప్తి హృదయాన్ని కదలించి వేస్తూంది. దీర్ఘశ్వాసలు వదులుతూ ఆలోచిస్తూవుంది కనకం. ఆరాత్రి కనకానికి కునుకు పట్టనే లేదు.

ప్రతిరోజూ నారాయణరావు గారబ్బాయిని యింటికి తీసుకు వస్తూవుంది కనకం. ఆకుర్రాడు యెంత యేడ్పించినా ఓపిగ్గా ఊరడించిఆడిస్తూ వుంటుంది. కొంత శ్రమ తప్పుతున్నందుకు సంతోషించి అభ్యంతరం చెప్పడంలేదు శాంత. పిల్లవాడు బాగా అలవాటు పడిపోయాడు. కామయ్య కూడా పిల్లవాడితో ఆటలాడుకోవడానికి అలవాటు పడ్డాడు.

పిల్లవాడికి పాకేవయసు, యింట్లో క్రింద పెట్టిన వస్తువులన్నీ దొర్లించడమే వాడిపని. బిందెలలో నీళ్లు బ్రతకనివ్వడు. వాడి అల్లరికి మురిసిపోతుండేది కనకం.

పిల్లవాడికి అయిదారు సంవత్సరాలువచ్చేవరకూ కనకం కాలక్షేపానికి ఏమాత్రం అంతరాయం కలుగలేదు. తరువాత కుర్రాణ్ణి బడిలో చేర్పించాలని

కొప్పి తీసుకొని వెళ్లిపోయారు వాళ్ల తాతగారు. కనకం హృదయం తుఫానులో చిక్కిన పిట్టలా కొట్టుకు లాడింది. సముద్రంలా ఘోషించింది. వారం పదిరోజుల వరకూ భోజనమే సహించలేదు.

ఆతరువాత నారాయణరావుగారింటి కెళ్లడమే మానుకున్నది. యిక తనకేంపని? యెప్పుడైనా కొంత కనబడితే బాబు సంగతులు అడిగి తెలుసుకుంటూ వుండేది. అంటీ ముట్టనట్టుగా జవాబు లిస్తూ వుండేదావిడ.

పిల్లలతో కాలక్షేపం చెయ్యాలంటే వాడ కట్టులో పిల్లలకేం లోటులేదు. కానీ, ఆపసివాడే కనకం హృదయాన్నాకర్షించుకున్నాడు. మనసు వాడి మీదికే పీకుతూ వుంటుంది. కానీ యేం లాభం? యెంత ప్రేమున్నా పరాయి పిల్లలు పరాయి పిల్లలే!

* * *

ఈ మధ్య నారాయణరావుగారి బాబు యింటికి వచ్చాడని తెలిసింది. కాని కనకం దగ్గరకురాలేదు. "బాబు యింటికివస్తే తప్పకుండా తనదగ్గరకు వస్తాడని కలలు కన్నది కనకం. కానీ కలలు కల్లలై పోయాయి. బాబును చూడటానికి కనకమే వాళ్లింటి కెళ్లింది. కానీ బాబు యిదివరకటంత చనువుగా దగ్గరకు రాలేదు. యెవరో తెలియని క్రొత్త వ్యక్తి చేతుల్లో చిక్కుకున్న ట్టియిబ్బంది పడినట్టు కనిపించాడు. కనకం హృదయ పూర్వకమైన వాత్స ల్యంతో అతన్ని కౌగలించి ముద్దాడింది. బాబు చిరాకు పడ్డాడు యెలాగో విదిలించుకొని పారి పోయాడు. కనకం మనస్సు వికలమై పోయింది

ఆతరువాత బాబు యెప్పుడైనా యింటికివచ్చినా కనకం దగ్గరకు వచ్చేవాడు కాడు. కనకాన్ని చూచి బయటికి రాకుండా దాక్కుంటూ వుండేవాడు. గాయపడిన హృదయంతోనే తిరిగి పోతూవుం డేది కనకం.

కాంక్షను తీర్చకుండానే కాలం సాగిపోతూ వుంది, అందరి మీద దాని ప్రభావాన్ని చూపిస్తూ అందరిలోను స్పష్టమయిన మార్పులు కన్పిస్తు న్నాయి. నల్లని కేశాలు పండి తెల్లబడుతున్నాయి. పిల్లలంతా పెద్దవాళ్లవుతున్నారు. యవ్వనపు నిగ నిగలు ప్రతిఫలిస్తున్నాయి.

గోవిందయ్యగారి పిల్లలంతా పెద్దచదువులే చదువుతున్నారు. పెద్దపిల్ల పెళ్లి చేయాలని రెండేళ్లనుండి ప్రయత్నం చేస్తూనే వున్నాడు గోవిం దయ్య. కానీ సంబంధం యేదీ కుదరలేదు. 'నాకూతురు పెళ్లి యెలా అవుతుందా' అంటూ ఆవేదన వెళ్లబోస్తూ వుండేది గోవిందయ్యభార్య.

సీతాలు కొడుకు పాలేరు తనం వుండి పది బస్తాలో, పన్నెండు బస్తాలో సంపాదిస్తున్నాడు. వాడికి పెళ్లి ఖాయమయింది మేనరికమే. సీతాలు పెళ్లి హడావిడిలో మునిగి పోయింది.

యీ జీవితానికి మిగిలిందొక్కటే—ఆవేదన! అందరికీ వున్న ఆనందాలు, ఆవేదనలు మాకులేవు. యీ ఆవేదనతోనే క్రుంగి చావడం తప్ప గత్యంతరమే లేదు. ఒక్కొక్కప్పుడు ఆవేదనతో హృదయం బరువెక్కి పోతుంది ప్రకృతి సహజమయిన వాంఛ మాతృత్వం తీరని కోరికై ఆమెను హేళన చేస్తున్నట్లుంది. అలాంటప్పుడు పిచ్చిదానిలా ... ంమీదపడి ఏడ్చిఏడ్చి నిద్రపోతూవుంటుంది. ... ఇంట్లో దీపమయినా వెలిగించలేదు ... ... నిద్రపోతు వుంది కనకం.

"దీపం వెలిగించకుండా పడుకున్నావేంటినే" కనకాన్నిలేపి అడిగాడు కామయ్య. అప్పుడే బజారు నుంచి వచ్చాడు.

"ఏమీలేదు" అన్నది ముక్తసరిగా.

కామయ్య మాట్లాడలేదు. యేం మాట్లాడు తాడు? యిల్లు చీకటయితే మాత్రం పోయిందే ముంది. బ్రతుకే చీకటయినప్పుడు? పిల్లలుంటే తప్పకుండా దీపం వుండి తీరాల్సిందే! ...లేకపోతే యీ పాటికి గోలగోలగా వుండదూ? గోవిందయ్య గారింట్లో సందడి వినబడుతూనే వున్నదిగదా? ఆ యింటికీ యీ యింటికీ యెంతతేడా?...స్వర్గా నికి స్మశానానికి పోలికా?' ఆలోచిస్తూ గడపలోనే కూర్చున్నాడు కామయ్య

"స్నానం చెయ్యండి." నీరసంగా అన్నది కనకం.

"చేస్తానులే. ...ముందుదీపం వెలిగించు."

కనకం లేచి దీపం వెలిగించింది. కనకంలో కన్పి స్తున్న మార్పును గురించి ఆలోచిస్తున్నాడు కామయ్య. యీ వాడకట్టులో తమ యీడువాళ్లం దరికంటే కనకం చిన్నదే. అయినా పిల్లాజల్లతో నానాబాధలు పడుతున్న గోవిందయ్య భార్య, సీతాలు మొదలయిన వాళ్లందరికంటే నీరసంగా, నిరు త్సాహంగా కన్పిస్తూవుంది. అందరికంటే ఉత్సా హంగా శక్తివంతంగా ఉండవలసింది యెందుకిలా అయిపోతూవుందో......'

"నీళ్లు తోడాను రండి". పిలిచింది కనకం. కామయ్య లేచి పెరటి వైపు నడిచాడు.

* * *

బజారుపని ముగించుకొని యింటికి బయలు దేరాడుకామయ్య ఆలోచనలు ఈగల్లా ముసురు కుంటూనే వున్నాయి. యెండ మంట మండిస్తూ వుంది. భారంగా అడుగులు వేస్తూన్నాడు కామయ్య సత్రం దగ్గరికొచ్చేసరికి ఓ దృశ్యం అతని కంట బడింది అడుగు ముందుకు పడలేదు సత్రంనీడ అతనికి స్వాగతం చెప్పింది.

ఓ యువతి తన యిద్దరి కొడుకులకు అన్నం పెడుతూ వుంది. వడిలో పసిపిల్లవాడు పాలు త్రాగుతున్నాడు. ఉన్న అన్నం కూడా కొంచమే! పిల్లలు ఆకలితో వకవక లాడుతున్నారు. తల్లి పెట్టిన అన్నం క్షణంలో కాజేశారు. ఉన్నకొంచము తల్లి తింటూవుంది. పిల్లలు తల్లిముఖం వైపే చూస్తూ కూర్చున్నారు. ఆయువతి పిల్లలవైపు జాలిగా చూస్తూ చిరునవ్వు నవ్వింది. ఆనవ్వులో విషాదఛాయలు లేకపోలేదు కానీ ఆనందం కూడా వున్నది! కామయ్య గుండె కరిగి నీరయింది. అడుగు ముందుకు పడలేదు. అస్థితిలో కూడా ఆమె ఆనందాన్ని పొందగలుగుతూవుందా? మాతృత్వం అంతటిశక్తి నివ్వకగలుగుతుందా? ఏమో! వాం పైపు అలాగే నిలబడి చూస్తూ వుండిపోయాడు కామయ్య.

"యెవ్వూరమ్మా!" తేరుకొని అడిగాడుకామయ్య.

"కనిగిరిబాబూ......" ఆ అమ్మాయిమాట యాసగావుంది.

"యేదైనా పనిమీదవచ్చారా?"

"అవును బాబూ! పనేమయినా దొరుకుతుం దేమోనని వచ్చాము. ఈపిల్లోడు కడుపునపడ్డాక చెప్పకుండా యెటో యెల్లి పోయాడు మగోడు. దిక్కులేనిదాన్ని....అక్కడేం పని దొరక్క యిక్కడి కొచ్చాముబాబూ." ఆ అమ్మాయి కనుకొలుకుల్లో నీళ్లు నిలిచాయి.

కామయ్య ఆశ్చర్యానికి అంతులేక పోయింది. భార్యా పిల్లల్ని విడిచిపెట్టి పోవడానికి వాడికి మన సెలా వచ్చిందో?......అతని కెంతోసానుభూతి కలి గింది. పిల్లలు ముగ్గురు ముచ్చటగా వున్నారు.

"ఒక్కదానవు ముగ్గురు పిల్లల్ని పెంచాలంటే కష్టం కదమ్మా! పిల్లల్ని యెవరైనా పెంచు కుంటారేమో చూడకపోయావా? కనీసం పసిపిల్లా గ్నయినా యెవరికైనా యిస్తే హాయిగాపెంచు కుంటారు."అతని మనసులో యేవో కోరికలు చెం రేగుతున్నాయి. వాటి కనుకనుగుణంగానే మాట్లాడు తున్నాడు కామయ్య.

"మాబోటి వాళ్ల పిల్లల్ని యెవరు పెంచు కుంటారండీ......" బాధగానే అన్నదాయువతి.


"యెవరిమాటో యెందుకు. యిస్తే మేమే పెంచుకుంటాం." ఆశగా ఆ యువతి ముఖంవైపు చూస్తూ అన్నాడు కామయ్య కుర్రాడివైపు వాత్సల్యంగా చూస్తూ వుండి పోయిందామె. జవాబు కోసమే యెదురు చూస్తున్నాడు కామయ్య.

"నామాట కాదనకమ్మా! నీకెంతో బాధతప్పి పోయినట్టే!" ప్రోత్సహించాడు.

"అలా అనకండి. నా బంగారు కొండనిచ్చి నేను బ్రతకలేను. మీకు దణ్ణంపెడతాను. అలా అనకండి." వాత్సల్యపూరిత మయిన హృదయంతో పిల్లవాణ్ణి గుండెలకత్తుకున్నది. కామయ్య మారు మాట్లాడ లేక పోయాడు నిరుత్సాహంగా యింటిదారి పట్టాడు.

* * *

యీమధ్య గోవిందయ్య పెద్దకూతురు పెళ్లి చేశాడు. యెంత సందడి.....? యెక్కడెక్కడి బంధు



వులు వచ్చారు. పెళ్లి ఘనంగానే జరిగింది. పెళ్లి కొడుకు అందరికీ నచ్చాడు. ఈడు జోడు కుదిరి చిలకా గోరింకల్లా చక్కగా వున్నారు వధూవరులు. పిల్లవాడికేదో మంచి ఉద్యోగమే.

పిల్లను అత్తవారింటికి తీసుకవెళ్తా వుంటే అంత ఆనందంగా పెళ్లి జరిపించిన గోవిందయ్య దంపతులు కళ్ల నీరు పెట్టుకున్నారు. 'కూతురు కాపురానికి పోవడం ఆనందదాయకమయిన విషయమేగదా? మరెందుకు యేడుస్తారు? అవి ఆనంద భాష్పా

[illegible] హ త్ర స్య

లేమో!...... లేక యింతకాలం ప్రేమగా పెంచిన పిల్ల దూరమైపోతున్నదనే ఆవేదనేమో!.... యేది యేమయినా యీ జీవితాల కిలాంటి అనుభూతులు లేవుగదా? యీ జన్మకింతే!' కామయ్య, కనకం ఎవరంతట వారే తమ తమ హృదయాలలో ఆవేదనను, అసంతృప్తిని వింపుకున్నారు.



# జ్యోష్యము మీ అదృష్టం చెప్పగలదు

భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ,మీ సరియైన వయస్సు గురించిన్నీ మీరు తెలుసుకోగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకుఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ,మీరు వ్రాయుతేదీ, వేళవివరములున్నూ, మీసరియైన చిరునామా, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ అగాయతు [illegible] యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, వ్యవహారములో మీకు జయముకలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, వ్యాజ్యములు,లాటరీ,అకస్మాత్ద్రవ్య లాభముమొదలగువానిని గురించి స్పష్టముగా వరుసవారీగా వ్రాసి రూ. 1.25పై.లకు వ్యాఖ్యము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం మీ గ్రహములేవైనా దుష్టములయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా వ్రాపిపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసుచేయబడును. ఒకసారిపరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI,
(A. W. P.) Post Box No 86, JULLUNDUR CITY.

నిరాశ చెందవద్దు

దాంపత్య జీవితంలోని బలహీనతగూర్చి మీరు చింతపడవద్దు

# జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేదటానిక్. ఉత్తమగుణములుగలది.కోల్పోయినశక్తి నిచ్చేకూర్చి మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన, యౌవనులుగా నుందురు.

ఎక్కువ ఫలితానికి :–

పౌష్టికాహారం మంచిది – కావలసినంత దేహ వ్యాయామము చేయవలెను – గ్రుడ్లు వాడరాదు.

ముఖ్యగమనిక : జీవన స్పెషల్ మీ దేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది కాబట్టి మూడు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట చాల అవసరం. లేనియెడల లావైపోదురు. లేక దాంపత్య వాంఛ అధికమగును. ఆరోగ్యం, బలం చేకూరినవెంటనే మానివేయవలెను. 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును.ధర రు.10/-

# అమృత లేపనం (పురుషులకు మాత్రము)

దాంపత్య జీవితములో తీవ్రమైన లేక జీర్ణించిన అన్ని రకాల బలహీనతలకు శక్తివంతమైన ఔషధము. (పై పూతకు మాత్రము) 25 M.L.L. సీసా 1 కి ధర రు. 10/– నికరం.

ఉచిత కరపత్రములకు వ్రాయండి ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను. అన్ని ఆర్డర్లతోపాటు ఔషధము ధరలో సగం పంపవలెను. మిగతమొత్తమునకు వి. పి. పి. పంపబడును ప్యాకింగు మరియు ఫార్వర్డింగ్ ఛార్జీలు అదనం. *Orders to:*

**Jeevamritham Oushadha Sala,**

CALICUT - 1. (S. India)

Chief Physician: Dr. K. N. RAMDAS Phone: 2419 & 3607

గమనిక : ఆంధ్ర, మధ్యప్రదేశ్ మరియు ఒరిస్సాలలోని అన్ని ముఖ్య పట్టణములకు స్టాకిస్టులు కావలెను. షరతులకు, నిబంధనలకు వ్రాయండి

మరుసటి సంవత్సరమే పెద్దకొడుకు పెళ్లి, ఆ తదుపరి సంవత్సరమే చిన్నకూతురు పెళ్లి వరుసగా యెలాగో అయిపోయాయనిపించుకున్నాడు గోవిందయ్య. యిక చిన్నకొడుకు పెళ్లే మిగిలింది. వాడొక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని తప్ప మరెవర్నీ చేసుకోనని పట్టు బట్టాడు. యెన్నో రకాలుగా నచ్చజెప్పాడు గోవిందయ్య. స్నేహితులతోను, పెద్దవాళ్లతోను చెప్పించారు. అన్న, అక్కచెల్లెళ్లు బావలు, బంధువులంతా చెప్పిచూచారు. కానీ వాడు యెవర్నీ లెక్క చేయలేదు. తాను ప్రేమించిన అమ్మాయినే రిజిస్టరు మేరేజి చేసుకున్నాడు. గోవిందయ్య ఆగ్రహం అవధులు దాటింది. 'ఈ గడప తొక్కడానికి వీల్లేద'ని శాసించాడు. కొడుకు కట్టు గుడ్డలతోనే బయటికెళ్లిపోయాడు. గోవిందయ్య కుటుంబములోని వాళ్లంతా యేదో పోయినట్టే బాధపడ్డారు కొన్నాళ్లు. కాలక్రమేణా అంతా ఆ బాధను మరచిపోయి మామూలుస్థితికి రాగలిగారు గానీ గోవిందయ్య, అతని భార్య తేరుకోలేకపోయారు.

ఆడపిల్లలు అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా యేదో పట్టణంలో కాపురం పెట్టాడు. చిన్నకొడుకు సరేసరి, యీ కుటుంబానికే కాకుండా పోయాడు. గోవిందయ్య యిల్లు నిర్మానుష్యమయినట్లే వుంది. వార్ధక్యంతో పోరాడుతూ దంపతు లిద్దరే మిగిలారు. యేదో అసంతృప్తి, నైరాశ్యం వాళ్లను వేధిస్తున్నట్లే కన్పించేవారు.

కొడుకులు కూతుళ్లు యెవరి సంసారాలు వాళ్లే చూచుకుంటున్నారు. గోవిందయ్య కుటుంబం నాలుగు కుటుంబాలయ్యింది. గోవిందయ్య యెంత అదృష్టవంతుడు! అనుకుంటూవుండే వాళ్ళు కామయ్య, కనకం— వాళ్లేకాదు యిరుగు పొరుగు వాళ్లుకూడా 'ఆడ పిల్లలకు మంచి సంబంధాలే వచ్చాయి. కొడుక్కి మంచి ఉద్యోగం దొరికింది. ఆయనకు కావలసిందేముంది'. అంటూ గోవిందయ్య అదృష్టాన్ని పొగుడుతూ వుండేవాళ్లు. అయితే 'చిన్న కొడుకుమాత్రం ఆ కుటుంబంలో చెడబుట్టాడు' అంటూ ఎత్తిచూపడం మాత్రం మరచిపోయేవాళ్లు కాదు.

అయిదారు రోజుల్నుంచి గోవిందయ్య ఆరోగ్యం బావుండడంలేదు. బయటకు రాకుండా యింటి దగ్గరే వుండి వైద్యం చేయించుకుంటున్నాడు. ఆ రోజు యింటికి రాగానే "గోవిందయ్య ఈ రోజు అసలు లేవలేదు. చాల యిదిగా వుంది" అన్నది కనకం. పలకరించడానికి వెళ్లాడు కామయ్య. గుమ్మములో అడుగు పెట్టగానే "రండన్నయ్యా" అంటూ ఆహ్వానించి మంచం ప్రక్కనే ముక్కాలి పీట వేసింది గోవిందయ్యభార్య.

"ఎలావుందయ్యా!" కూర్చుంటూనే అడిగాడు.

"యేదోవుంది. యేమయినా నువ్వు అదృష్టవంతుడవు కామయ్యా. యీ బాదర బందీ అంతా లేదు నీకు." గోవిందయ్య కనుకొలుకుల్లో కన్నీటి బిందువులు మెరుస్తున్నాయి. కామయ్య మనసులో చేయిపెట్టి దేవినట్లయింది. ఆవేదన పెల్లుబికింది ఒక్కసారిగా. కన్నీళ్లు జలజలా రాలాయి. అతి ప్రయత్నంమీదగానీ కామయ్య నిగ్రహించుకోలేక పోయాడు

"యేమీలేని అదృష్టం దేనికి గోవిందయ్యా! యేం చూచి నా అదృష్టాన్ని కీర్తిస్తున్నావ్?.... తాత్కాలికంగా నీకు కలిగిన బాధ అలా అనిపిస్తూ వుంది అంతే. యిలాంటి అదృష్టం పగవాళ్లకు కూడా వద్దు." అంటూనే పై పంచతో కన్నీళ్లు వత్తుకున్నాడు కామయ్య.

"జీవితంలో అనుభవించాల్సిన సుఖశాంతులన్నిటినీ బలిచేసుకొని అష్టకష్టాలు అనుభవించి పెంచాం. యేంలాభం? రెక్కలు రాగానే యెవరిదారిన వాళ్లు పోయారు. మా బాధలే మమ్మల్ని కనిపెట్టుకుని వున్నాయ్. యెందు కొచ్చిన పిల్లలు కామయ్యా! అంతా ఋణానుబంధమే తప్ప మరో అనుబంధమే లేకపోయిన తరువాత." గోవిందయ్య కళ్ల నుండి కన్నీళ్లు జారుతున్నాయి. కామయ్య మనసు పూర్తిగా వికలమయ్యింది.

"పెద్దవాడికి ఉత్తరం రాస్తే యింతవరకు జవాబు రాయలేదన్నయ్యా! చిన్నవాడు రెండు సార్లొచ్చి పలకరించినా మాట్లాడకనే పోయాడు. అంతా మన మనుకున్నట్టే జరుగుతుందా? యెవడి రాత యెలావుందో.....! మనమాట కాదంటేమాత్రం కడుపున పుట్టిన బిడ్డను కాదనుకుంటే యెలాగన్నయ్యా!..... ఆడపిల్లలు సరేసరి, ఒకయ్య చేతిలో పెట్టిన తరువాత వాళ్లిష్టం సాగుతుందా?." కన్నీళ్లు వత్తుకుంటూ వివరించింది గోవిందయ్య భార్య కామయ్య కొంతసేపు కూర్చొని అన్ని విషయాలు శ్రద్ధగా విన్నాడు.

జీతం చాలక నానా యిబ్బందులు పడుతున్నా, అప్పులవాళ్లు నానాగొడవ చేస్తున్నా అవన్నీ యెప్పటి కప్పుడే మరచిపోయి తన పిల్లల ముచ్చట్లు చెప్పుకొని మురిసిపోతూ వుండేవాడు గోవిందయ్య. ప్రకృతి ఆనంద పరంపరతో పాటు దాని నిజమయిన మాధుర్యం తెలియడానికా అన్నట్లు కొన్ని బాధలను కూడా ప్రసాదించింది. అన్నిటినీ అనుభవించి జీవితాన్ని పరిపుష్టి చేసుకున్న గోవిందయ్య యింకా తనకేదో లేకుండావుంటే బాగుండేదని వాపోవడం కామయ్యకు వింతగా తోచింది. తీరని తీయని కోరికలతో తపించిపోతూ స్వాతి వానకు ముత్యపు చిప్పల్లా, చంద్రునికై చకోరాల్లా యెదురుచూచి చూచి ఆశలు నిరాశలేనని రూఢి చేసుకుని 'నువ్వే అదృష్టవంతుడివి కామయ్యా!' అన్న గోవిందయ్య మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. మెల్లగా లేచి, సెలవు తీసుకొని యింటికి బయలుదేరాడు కామయ్య.

గోవిందయ్య వ్యాధి తీవ్రమయింది. చిన్న కొడుకు డాక్టర్ని తీసుకవచ్చి చూపిస్తూనే వున్నాడు.

పెద్దకొడుకు ఒకనెల సెలవుపెట్టి భార్యాపిల్లల్ని తీసుకొని వచ్చాడు. ఆ తరువాత వరుసగా ఆడపిల్లలు కూడా పిల్లాజల్లతో వచ్చి చేరారు. యిల్లు యిదివరకటికంటే యెక్కువ సందడితో కళకళ లాడుతూవుంది.

గోవిందయ్య కొడుకులు కూతుళ్లు యెన్నో సపర్యలు చేస్తున్నారు. యెంతో బాధపడుతున్నారు. తండ్రిని కంటికి రెప్పలా కనిపెట్టి వుంటున్నారు. తనకోసం, తన ఆరోగ్యంకోసం బాధ పడేవాళ్ళు, పాటు పడేవాళ్లు ఒక్కడుంటే చాలు, యెంతో సంతృప్తి పొందగలుగుతాడు మానవుడు. గోవిందయ్య నిజంగా ఎంత అదృష్టవంతుడు!? 'నా' అనే వాళ్లు నలుగురున్నారతనికి. నిజంగా అతని జన్మ సార్థకమయినట్లే " అనుకున్నాడు కామయ్య తృప్తిగా.

గోవిందయ్యను పలకరించడానికేవచ్చాడుకామయ్య.

"రా మామయ్యా కూర్చో " మర్యాదగా ఆహ్వానించాడు గోవిందయ్య పెద్దకొడుకు. గోవిందయ్య మంచానికి దగ్గరగానే వున్న కుర్చీలో కూర్చున్నాడు కామయ్య. గోవిందయ్య కళ్లు మూసుకొని పడుకొని వున్నాడు.

"నాన్నా యెవరో నీకోసం వచ్చారు చూడు " అన్నాడు పెద్దబ్బాయి.

గోవిందయ్య కళ్లు విప్పి చూచాడు అతని ముఖంలో యిదివరకటి ఆవేదన లేదు ఆ కళ్లలో యిదివరకటి నిరాశలేదు. ప్రశాంతత, సంతృప్తి స్పష్టంగా కన్పిస్తున్నాయి. కామయ్య చిన్న నిట్టూర్పు విడిచాడు.

గోవిందయ్య చేతి సంజ్ఞతో యేదో చెప్పాడు కానీ, కామయ్యకు అర్థం కాలేదు "నిన్నటినుండి మాటకూడా పోయింది." బాధగా చెప్పాడు పెద్దబ్బాయి. కామయ్య మనసు నీరయింది. ఆవేదనతో బరువెక్కినట్లయింది. చాలసేపు కూర్చున్నాడు. తేరుకొని, అందర్నీ పరామర్శచేసి యింటికి బయలుదేరాడు.

* * *

కనకం రెండు రోజుల నుండి గుండెనొప్పితో బాధపడుతూ వుంది. డాక్టరుకోసం, మందుల కోసం తిరగడంతోనే సరిపోతూవుంది కామయ్యకు. యేమయితేనేం బాధ కొంచెం తగ్గింది. కనకం కాస్త స్థిమితపడడంతో కామయ్య గండెలు కుదుట పడ్డాయి. అప్పుడే భోజనంచేసి అలా కుర్చీలో నడుం వాల్చాడు. అంతలోనే గోవిందయ్య యింటిలో నుండిశోకాలువిన్పించాయి. లేచి అలా బయలుదేరాడు.

'తన స్నేహితుడు గోవిందయ్య తనకులేడు.' కామయ్య హృదయం ఆవేదనా పూరితమయిపోయింది. దుఃఖం ఆగలేదు. యిరుగు పొరుగు వాళ్లంతా గోవిందయ్య యింటిముందు గుమిగూడారు. దహన సంస్కారాలకు కావలసిన యేర్పాట్లన్నీ త్వరత్వరగా జరిగిపోతున్నాయి.

'గోవిందయ్య భౌతికంగా యీ లోకాన్ని వదిలిపోయినమాట నిజం. కానీ అతని వంశ వృక్షం శాఖోపశాఖలయి దినదినాభివృద్ధి చెందుతూ గోవిందయ్యను శాశ్వతంగా యీ లోకంలో వుంచుతుంది. గోవిందయ్య ముమ్మాటికీ చిరంజీవి!' కామయ్య బాధగా నవ్వుకున్నాడు.

కనకం యేదో చెబుతూవుంది. కామయ్య పరధ్యాన్నంలో వుండి 'ఊ' కొడుతున్నాడు. "యెవరూ తీరని మనం యింత అఘోరిస్తున్నామే గానీ, వున్న వాళ్లుమాత్రం యేం చేయగలిగారు? గోవిందయ్యను ముసలివాడు కాకుండా ఆపగలిగారా? చావకుండా రక్షించగలిగారా?.... యేమీ లేదు సహజత్వాన్ని యెవ్వరూ యెదిరించలేరు. కానీ,.... ప్రతివాళ్లూ యేవో కోరికలతో బాధపడుతూనే వుంటారు. యిది ప్రకృతి సహజమేమో....."

"సంతృప్తి పడుతున్నావా?" అడిగాడు కామయ్య ఆవేదనతో.

"లేదు. అది లేకపోవడమే ఆవేదనకు మూలకారణమేమో ననుకుంటున్నాను." పొడిగా అన్నది కనకం. కామయ్య బాధగా చిరునవ్వు నవ్వాడు.

ఆకాశం మబ్బులుపట్టి వికలంగా వుంది. చలిగాలి దీపాన్ని వెలగనివ్వడం లేదు. యిద్దరూ మౌనంగా చీకట్లోనే కూర్చున్నారు. సీతాలు మనుమడు యింటి మీది తాటాకులు యెగిరిపోయేలా యేడుస్తున్నాడు. సీతాలు కోడల్ని యేదో సాధిస్తూవుంది.

నిట్టూర్చి "దీపంవెలిగించు." అన్నాడు కామయ్య. కనకం యేమీ మాట్లాడలేదు. ●

